ఈనాడు
పెద్దపల్లి
శుక్రవారం అక్టోబరు 18, 2024

మానవీయ విలువలు బోధించిన వాల్మీకి


వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష, అధికారులు

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: హైందవ ధర్మానికి అతి ముఖ్యమైన రామాయణ గ్రంథాన్ని రచించడంతో పాటు మానవ సంబంధాలు, విలువలను బోధించిన మహనీయుడు వాల్మీకి అని కలెక్టర్ శ్రీహర్ష పేర్కొన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం సమీకృత పాలనా ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎన్నీల ముచ్చట్లు

సమీకృత పాలనా ప్రాంగణం ఆవరణంలో గురువారం రాత్రి తెలంగాణ రచయితల వేదిక(తె.ర.వే) ఆధ్వర్యంలో ఎన్నీల ముచ్చట్లు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు తమ రచనలు వినిపించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్, తెరవే జిల్లా అధ్యక్షుడు సీవీ కుమార్, ప్రధానకార్యదర్శి శంకరయ్య, సీనియర్ రచయితలు స్వామి, తిరుపతి, నాగభూషణం, లక్ష్మీనారాయణ, దేవేందర్ పాల్గొన్నారు.


ఆకట్టుకున్న కళోత్సవ పోటీలు


బాలికల నృత్య ప్రదర్శన

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి కళోత్సవ పోటీలు ఆకట్టుకున్నాయి. సంప్రదాయ, జానపద నృత్యాలు, చిత్రలేఖనం, వాయిద్య పోటీల్లో పలువురు ప్రతిభ చాటారు. అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ మాట్లాడుతూ కళలు మనలోని సృజనాత్మకతను పెంచుతాయన్నారు. డీఈవో మాధవి, సమగ్ర శిక్ష జిల్లా సమన్వయకర్త పీఎం షేక్ పాల్గొన్నారు.

ఆర్టీసీకి దసరా పండుగ

14 రోజుల్లో రూ.31 కోట్ల ఆదాయం



న్యూస్‌టుడే, కరీంనగర్ రవాణా విభాగం

దసరా పండుగ ఆర్టీసీకి గణనీయ ఆదాయం తెచ్చింది.. రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక బస్సులు నడపడం.. లక్షలాది మంది బస్సుల్లో ప్రయాణించడంతో సంస్థకు రూ.కోట్ల ఆదాయం సమకూరింది. పాఠశాలలకు ఈ నెల 2న సెలవులు ప్రకటించగా 1వ తేదీ సాయంత్రం నుంచే ప్రారంభమైన రద్దీ 16వ తేదీ వరకు కొనసాగింది.. సంస్థ రూ.31.49 కోట్ల ఆదాయం ఆర్జించింది.

ప్రత్యేక ఏర్పాట్లతో..

పండుగల సందర్భంగా రద్దీ అధికంగా ఉంటుందని భావించిన ఆర్టీసీ అధికారులు పకడ్బందీ ప్రణాళికతో సాగారు. జేబీఎస్‌తోపాటు ఆదిలాబాద్, మంచిర్యాల, హనుమకొండ ప్రాంతాలకు అదనపు సర్వీసులు నడిపారు. సరిపడా బస్సులు లేకపోవడంతో హైదరాబాద్ నుంచి సిటీ బస్సులను తెప్పించి రద్దీకి అనుగుణంగా పంపించారు. ఈ నెల 3 నుంచి 11 వరకు డిప్యూటీ ఆర్‌ఎంలు, డీఎంలు, సూపర్‌వైజర్లు జేబీఎస్‌లో మకాం వేసి రద్దీని పరిశీలిస్తూ అందుకు అనుగుణంగా చర్యలు తీసుకున్నారు. తిరుగు ప్రయాణంలో ఆర్‌ఎం సుచరిత, డిప్యూటీ ఆర్‌ఎంలు ఎస్.భూపతిరెడ్డి, సత్యనారాయణ కరీంనగర్ బస్టాండ్‌లోనే ఉంటూ రద్దీని స్వయంగా పరిశీలిస్తూ ఆయా రూట్లలో బస్సులు తిరిగేలా చూశారు.

డిపోల వారీగా..

● ఆదాయపరంగా గోదావరిఖని డిపో రూ.5.27 కోట్లతో మొదటి స్థానంలో నిలవగా, హుస్నాబాద్ డిపో రూ.1.43 కోట్లతో చివరి స్థానంలో నిలిచింది. ప్రయాణికులపరంగా గోదావరిఖని డిపో 9.79 లక్షల మంది ప్రయాణికులను (మహిళలు 6.87 లక్షలు) చేరవేసి ప్రథమ స్థానంలో నిలవగా, వేములవాడ డిపో 5.16 లక్షల మందిని (మహిళలు 3.95 లక్షలు) చేరవేసి చివరి స్థానంలో నిలిచింది.

సమష్టి కృషితోనే సాధ్యమైంది : లక్షలాది ప్రయాణికులను సురక్షితంగా వారి వారి గమ్యస్థానాలకు చేర్చడంలో సిబ్బంది పాత్ర ప్రశంసనీయం. డ్రైవర్లు, కండక్టర్లు, కంట్రోలర్లు, డిప్యూటీ ఆర్‌ఎంలు, డీఎంలు ఇతర సిబ్బంది సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ముందుకు సాగాం.
- సుచరిత, రీజినల్ మేనేజర్, కరీంనగర్ రీజియన్

● తిరిగిన ట్రిప్పులు : 12,726
● దూరం : 53.32 లక్షల కిలోమీటర్లు
● మొత్తం ప్రయాణికులు : 61,11,849
● మహిళలు : 42,34,544 (69 శాతం)

డిపో	ఆదాయం(రూ.కోట్లలో)
గోదావరిఖని	5.27
కరీంనగర్-2	4.23
జగిత్యాల	4.21
కరీంనగర్-1	3.38
వేములవాడ	2.32
సిరిసిల్ల	2.27
కోరుట్ల	2.25
మెట్‌పల్లి	2.14
హుజూరాబాద్	2.11
మంథని	1.83
హుస్నాబాద్	1.43

రేషన్ దుకాణాలకు నిలిచిన బియ్యం సరఫరా


యంత్రానికి మరమ్మతు చేస్తున్న మెకానిక్

న్యూస్‌టుడే, మంథని: మంథనిలోని పౌరసరఫరాల గోదాంలో ఈ-పాస్ యంత్రం పని చేయకపోవడంతో నాలుగు రోజులుగా రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా నిలిచిపోయింది. డివిజన్ పరిధిలోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాల్లోని 28 దుకాణాలకు రెండో విడతలో సుమారు 300 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేయాల్సి ఉంది. నాలుగు మండలాల్లోని 93 రేషన్ దుకాణాలకు ప్రతి నెలా 6,529 క్వింటాళ్లు, ప్రభుత్వ పాఠశాలలకు 74 క్వింటాళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు 65 క్వింటాళ్ల బియ్యాన్ని మంథని గోదాం నుంచే సరఫరా చేస్తున్నారు. రేషన్ దుకాణాలకు రెండో విడతలో బియ్యం సరఫరా చేయాల్సి ఉంది. బియ్యం అందకపోవడంతో డీలర్లు గోదాం చుట్టూ తిరుగుతున్నారు. బియ్యం ఇవ్వడం లేదని వినియోగదారులు తమపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని డీలర్లు ఆవేదన చెందుతున్నారు. ఈ-పాస్ యంత్రాన్ని బాగు చేసేందుకు కరీంనగర్ నుంచి మెకానిక్‌ను పిలిపించారు. గురువారం సాయంత్రం యంత్రాన్ని బాగు చేయడంతో రేషన్ దుకాణాలకు బియ్యం పంపిస్తున్నామని, శుక్రవారం లోగా సరఫరా పూర్తవుతుందని గోదాం ఇన్‌ఛార్జి అజయ్ తెలిపారు.

భూసేకరణ ప్రక్రియలో వేగం పెంచండి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సూచించారు. భూసేకరణపై గురువారం సమీకృత పాలనా ప్రాంగణంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి మండలం కూనారం రైల్వే బ్రిడ్జి, అంతర్గాం మండలం మొగల్‌పహాడ్, ధర్మారంలో నీటి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణలో వేగం పెంచాలన్నారు. పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, జిల్లా భూకొలతల, దస్త్రాల శాఖ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిర్వహణ లోపం.. నీరే గరళం

● ట్యాంకులు శుభ్రపరచక కలుషితం
● వ్యాధులు ప్రబలుతున్నా చర్యలు కరవు

గొంతెండినప్పుడు దాహం తీర్చాల్సిన నీరే నిర్వహణ లోపంతో గరళంగా మారుతోంది. ట్యాంకులను శుభ్రం చేయక, లీకేజీలకు అడ్డుకట్ట వేయకపోవడంతో తాగునీరు కలుషితమవుతోంది. గత నెలలో కురిసిన వర్షాలకు జిల్లాలోని చాలా గ్రామాల్లోని రక్షిత పథకాలు నీట మునిగాయి. కలుషిత జలాలను తాగి వందలాది మంది రోగాల బారిన పడ్డారు. కొద్ది రోజుల కిందట సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో కలుషిత నీటిని తాగి ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పలు ప్రాంతాల్లో సరఫరా తీరును 'న్యూస్‌టుడే' పరిశీలించింది.

పరిశీలన
న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్, పెద్దపల్లి

నెలలో మూడు సార్లు ట్యాంకులను శుభ్రం చేయాలనే నిబంధనలున్నా జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. పాత పథకాలు 352 ఉండగా మిషన్ భగీరథలో మరో 354 నిర్మించి సరఫరా చేస్తున్నారు. బ్లీచింగ్‌పౌడర్‌తో ట్యాంకులను శుభ్రం చేయాల్సి ఉండగా మొక్కుబడి తంతు కొనసాగిస్తున్నారు. ట్యాంకులకు పగుళ్లు ఏర్పడి లీకవుతున్నాయి. చాలా చోట్ల వాసన వస్తున్న నీటిని జనం తాగడం లేదు. మొత్తం 265 పంచాయతీల్లో 1,100 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. చెత్త తొలగింపు, మురుగుకాలువల శుభ్రతకే వీరు పరిమితమవుతున్నారు. రెండు నుంచి నాలుగు ట్యాంకులున్న పెద్ద పంచాయతీల్లో ఇబ్బందులు అధికంగా ఉంటున్నాయి. పంచాయతీలకు నెలల తరబడి నిధుల విడుదల లేక బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది.

చేస్తున్నామంటున్నా తేదీలు రాయరు!


క్రిస్టియన్‌కాలనీలోని ట్యాంకు వద్ద శుభ్రం చేసిన తేదీ వేయకుండా ఖాళీగా వదిలేసిన దృశ్యం

పెద్దపల్లి పురపాలికలో 9 ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. 45 రోజులకు ఒకసారి ట్యాంకులను శుభ్రం చేస్తున్నట్లు చెబుతున్నా బోర్డులపై తేదీలు రాయడం లేదు. స్థానికంగా నీటి పరీక్షలు నిర్వహించడం లేదు. కేవలం ముర్మూర్‌లోని భగీరథ పంపింగ్ కేంద్రంలో మాత్రమే నిర్వహిస్తున్నారు. కుళాయి నుంచి సరఫరా ప్రారంభమైన కొద్దిసేపటివరకు నీరు మురికిగా వస్తోంది. పట్టణంలోని పైపులైను లీకేజీలు లేని వీధులు లేకపోవడం గమనార్హం.

జ్వరాలు ప్రబలినా చర్యలు మృగ్యం

మంథని గ్రామీణం: గుంజపడుగులో నాలుగు ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. స్థానికంగా 100 ఇళ్లకు తాగునీటిని అందించే వైద్యశాల సమీపంలోని ట్యాంకు పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ట్యాంకు నిండి వృథాగా పోయే నీటితో పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. గేటువాల్వు కుండీలో పాకురు పట్టింది. కొద్ది నెలల కిందట గ్రామంలో జ్వరాలు విజృంభించి పదుల సంఖ్యలో మంచం పట్టారు. నెల్లిపల్లిలోని ట్యాంకు గేటువాల్వు కుండీలో నీరు నిలుస్తుండగా తాగు నీరు కలుషితమవుతోంది. నాగారం, కన్నాల గ్రామాల్లో కొన్ని రోజుల కిందట వాసనతో కూడిన తాగునీటిని సరఫరా చేశారని స్థానికులు తెలిపారు.


నెల్లిపల్లిలోని ట్యాంకు కింద గేటువాల్వు చుట్టూ నిలిచిన నీరు

'భగీరథ'తో వాగు నీరు కలిపి సరఫరా


గేట్‌వాల్వు వద్ద లీకేజీతో ఏర్పడిన బురద

సుల్తానాబాద్: గట్టెపల్లిలో దాదాపు 2500 జనాభా ఉండగా ఊరంతటికీ ఒకే నీటి ట్యాంకు ఉండగా మిషన్ భగీరథ నీరు, మానేరు జలాన్ని ఇందులోకే ఎక్కిస్తున్నారు. ఇక్కడి నుంచే ఊరంతటికీ తాగునీటిని సరఫరా చేస్తున్నారు. రెండు నెలలుగా ట్యాంకులో క్లోరినేషన్, శుభ్రం చేసిన దాఖలాలు లేవని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. శుభ్రం చేసిన తేదీని తెలిపే ఏర్పాటు కూడా లేదు. ప్రధాన కూడలి వద్ద గేట్‌వాల్వు లీకేజీతో నీరు వృథాగా పోతోంది. 20 ఏళ్ల కిందట వేసిన పైపులైను శిథిలావస్థకు చేరుకుంది. మిషన్ భగీరథ నీరు తాగలేక స్థానికులు ప్రైవేటు ప్లాంట్ల నుంచి కొనుక్కుంటున్నారు.

ఎప్పుడో ఒకసారి శుభ్రం


ట్యాంకు అడుగు భాగంలో బురద

ధర్మారం: మండల కేంద్రంలో అయిదు బావులు, నాలుగు ట్యాంకులున్నాయి. మిషన్ భగీరథ జలాలు అందని బీసీ, ఎస్టీ కాలనీలకు ఊరకుంట చెరువు పక్కనున్న ట్యాంకు, బావి ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఎప్పుడో ఒకసారి ట్యాంకును చేస్తున్నారని బీసీ కాలనీవాసులు తెలిపారు. ట్యాంకు పల్లపు ప్రాంతంలో ఉండటంతో ఎప్పుడూ నీరు నిలిచే ఉంటోంది. అందులో పందులు పొర్లుతూ అపరిశుభ్రత నెలకొంది. పంచాయతీ ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా విషయమై బ్లీచింగ్, క్లోరినేషన్, ట్యాంకుల శుద్ధి, బల్క్ వాటర్ సప్లై, లీకేజీలు, ఫిర్యాదులు, కొత్త కనెక్షన్ల పేరిట ఏడు రిజిస్టర్లు నిర్వహిస్తున్నారు. ట్యాంకును ప్రతి నెలా 1, 13, 21 తేదీల్లో శుద్ధి చేయిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి రవికిరణ్ తెలిపారు.

లీకేజీతో కలుషితం

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ పాఠశాల సమీపంలోని గేట్‌వాల్వు లీకేజీతో నీరు కలుషితమవుతోంది. వాల్వులపై కప్పు నిర్మించలేదు. ట్యాంకులను 15 రోజులకోసారి కడుగుతున్నామని చెబుతున్నా శుభ్రం చేసిన తేదీలు ప్రదర్శించడం లేదు. మిషన్ భగీరథ, హుస్సేన్‌మియా వాగు నీటిని కలిపి సరఫరా చేస్తున్నారు.


కమాన్‌పూర్: ఇస్లాంనగర్ ట్యాంకు వద్ద మురుగు కూపం

వృథా జలాల కిందనే పైపులైన్లు


కమాన్‌పూర్-సిద్దిపల్లి మార్గంలో లీకవుతున్న తాగునీరు

కమాన్‌పూర్: కమాన్‌పూర్ పంచాయతీ పరిధిలో 7 ట్యాంకులుండగా మిషన్ భగీరథ నీటితో నింపుతున్నారు. ట్యాంకులను తరచూ శుభ్రం చేస్తున్నా పరిసరాలను మాత్రం పట్టించుకోవడం లేదు. ఇస్లాంనగర్‌లోని ట్యాంకు పక్కన నీటిలో ఇటీవల నిమజ్జనం చేసిన బతుకమ్మల వ్యర్థాలను తొలగించలేదు. వాటి కిందనే పైపులైన్లు ఉండటంతో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. కమాన్‌పూర్ నుంచి సిద్దిపల్లి మార్గంలో ట్యాంకు వద్ద కొద్ది నెలలుగా తాగునీరు లీకవుతోంది.

రహదారుల నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరు

మంథని, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పలు మార్గాల్లో రహదారులకు మహర్దశ రానుంది. గ్రామీణ రహదారుల అభివృద్ధి పథకం కింద ఏడు రోడ్ల నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి బూడిదపల్లి మీదుగా ధన్వాడ వరకు రూ.3.95 కోట్లు, కాటారం మండలం గుండ్రాత్‌పల్లి నుంచి ఊట్లపల్లి పోచమ్మవరకు రూ.2 కోట్లు, కాటారం మండలం ఒడిపిలివంచ నుంచి గూడూరు జడ్పీ రోడ్డు వరకు రూ.3 కోట్లు, కాటారం మండలం దామరకుంట పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి ఆరెంద మానేరు రోడ్డుకు రూ.2 కోట్లు, కమాన్‌పూర్ మండలం రాజాపూర్ వంతెన నుంచి మంగపేట వరకు రూ.3.05 కోట్లు, కమాన్‌పూర్ నుంచి పెంచికల్‌పేట వరకు రూ.4 కోట్లు, మంథని మండలం పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి ఖానాపూర్ మీదుగా ఎల్‌మడుగు వరకు రూ.7 కోట్లు మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

మోసం కొండంత.. వసూలు గోరంత!

సవాలుగా జీఎస్టీ అక్రమాల కేసు

ఈనాడు, కరీంనగర్

జగిత్యాల కేంద్రంగా జరిగిన జీఎస్టీ మోసం కథ ఎటూ తేలడం లేదు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) పరిధిలోని ఐటీసీ (ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్) రూపంలో జరిగిన అక్రమ బాగోతం తాలూకు విచారణ ఇంకా నడుస్తూనే ఉంది. సుమారు 9 నెలల కిందట జగిత్యాలకు చెందిన జీఎస్టీ ప్రాక్టీషనర్ తప్పుడు ధ్రువపత్రాలతో బోగస్ సంస్థలను ఏర్పాటు చేసి దాదాపుగా రూ.288 కోట్ల ఆర్థిక మోసానికి పాల్పడ్డారని అధికారులు గుర్తించారు. కాగితాలపైనే సృష్టించిన పలు బోగస్ కంపెనీలకు ఆ సొమ్మును బదలాయించారు. ఈ అడ్డగోలు వ్యవహారాన్ని ఆలస్యంగా గుర్తించిన వాణిజ్య పన్నుల అధికారులు మొదట విస్తుపోయారు. తీరిగ్గా తేరుకుని బాధ్యుడిగా గుర్తించిన వ్యక్తి కార్యాలయంలో సోదాలు చేపట్టారు. పలు పత్రాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేసి అరెస్ట్ చేయించారు. తరువాత ఈ విచారణను హైదరాబాద్ నుంచి వచ్చిన వాణిజ్య పన్నుల శాఖ విజిలెన్స్ అధికారులు చేపట్టారు. తమ సంస్థలను మూసివేయమని జీఎస్టీ ప్రాక్టీషనర్ వద్దకు వచ్చిన కొందరు వ్యాపారుల ఆధార్ కార్డులను ఉపయోగించి ఆన్‌లైన్‌లో ఈ కుంభకోణానికి తెరతీసినట్లు విచారణలో గుర్తించారు. ఇలా 32 బోగస్ కంపెనీలను ఏర్పాటు చేసి సిమెంట్, ఐరన్ వ్యాపారాలు చేస్తున్నట్లు కాగితాల్లోనే నమ్మించాడు. ఆ బోగస్ సంస్థలకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రూపంలో జమ అయిన మొత్తం డబ్బులను 302 మంది వ్యాపారులకు బదిలీ అయినట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. తెలంగాణలోని పలు ప్రాంతాలతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన సంస్థలకు ఈ నగదు వెళ్లినట్లు గమనించారు. ఇందులో పెద్దమొత్తంలో ఒక సంస్థకు రూ.120 కోట్లు బదలాయింపు జరిగిన తీరు తెలుసుకుని అధికారులు నివ్వెరపోయారు.

వసూలు కష్టమే..

కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఈ అక్రమంలో భాగమైన బాధ్యుడిని గుర్తించి పట్టుకున్నప్పటికీ.. పక్కదారి పట్టిన సొమ్మును తిరిగి వసూలు చేయడం అధికారులకు తలకు మించిన భారంగానే మారింది. ఇప్పటి వరకు గుర్తించిన పలువురు వ్యాపారులు, సంస్థల నుంచి రూ.13 కోట్లకుపైగా డబ్బును రాబట్టినట్లు తెలిసింది. మొత్తం మోసంలో ఇప్పటివరకు రికవరీ అయింది కేవలం 5 శాతమే. మూడు నెలల కిందటి వరకు రూ.11 కోట్లు రాగా. . ఇటీవల ఈ మొత్తం రూ.13 కోట్లను దాటినట్లు సమాచారం. జగిత్యాల కేంద్రంగా జరిగిన ఈ భారీ మోసాన్ని అప్పట్లో సవాలుగా తీసుకున్న అధికారులు కాలక్రమేణా ఇతర పనుల్లో తీరిక లేకుండా పోవడంతో విచారణలో దూకుడు ప్రదర్శించడం లేదన్న ఆరోపణలున్నాయి. ముఖ్యంగా పోలీసులు, వాణిజ్య పన్నుల అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తే ఇంకా ఇందులో భాగమైన వారెవరనేది బాహ్య ప్రపంచానికి తెలిసే అవకాశముంది. పైగా రాష్ట్రంలోనే బోగస్ సంస్థలు ఏర్పాటు చేసి సొమ్మును బదలాయించినట్లు గుర్తించిన అధికారులు అందులో కొందరికి సర్‌ఛార్జ్ నోటీసులు అందించినట్లు తెలుస్తోంది. తరువాత రెవెన్యూ రికవరీ (ఆర్‌ఆర్) చట్టాన్ని ఉపయోగించి పోయిన నగదును తిరిగి చేజిక్కించుకునే విషయమై కసరత్తు చేసింది. పూర్తిస్థాయిలో మోసపోయిన సొమ్మును వసూలు చేయడం కష్టసాధ్యంగా ఆ శాఖ వర్గాలు భావిస్తున్నాయి. ఈ విషయమై వాణిజ్య పన్నుల శాఖ కరీంనగర్ డివిజన్ జాయింట్ కమిషనర్ రవికుమార్‌ను సంప్రదించగా రికవరీ ఎంత చేశారనేది ఈ కేసుని పర్యవేక్షిస్తున్న హైదరాబాద్‌లోని అధికారులకే తెలుస్తుందన్నారు.

వడివడిగా వార్షిక మరమ్మతులు

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో వారం రోజుల్లో ఉత్పత్తి పునరుద్ధరణ

న్యూస్‌టుడే, ఫెర్టిలైజర్ సిటీ


రామగుండం ఎరువుల కర్మాగారం

ఏపీ, తెలంగాణతోపాటు పొరుగు రాష్ట్రాల్లోని రైతాంగానికి యూరియా కొరత నివారణలో కీలకపాత్ర పోషిస్తున్న రామగుండం ఎరువుల కర్మాగారంలో వార్షిక మరమ్మతులు చురుగ్గా సాగుతున్నాయి. వారం రోజుల్లో యూరియా ఉత్పత్తిని పునరుద్ధరించాలనే ప్రణాళికతో అధికారులు ముందుకు సాగుతున్నారు. సాధారణంగా ఏటా నవంబరులో కర్మాగారంలో ఉత్పత్తి నిలిపివేసి అవసరమైన విభాగాల్లో మరమ్మతులు చేపడతారు. రానున్న ఏడాదికాలంపాటు నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటారు. ఈసారి నెల ముందుగానే మరమ్మతులు మొదలుపెట్టారు.

23న పునఃప్రారంభం

వార్షిక మరమ్మతుల ప్రణాళిక ప్రకారం ఈ నెల 23న కర్మాగారాన్ని తిరిగి ప్రారంభించనున్నారు. 26న యూరియా ఉత్పత్తి ప్రారంభం కానుంది. దీనికి అనుగుణంగా యూరియాను తరలించేందుకు రైల్వే వ్యాగన్ల షెడ్యూలు సైతం రూపొందించారు. కేవలం 15 రోజుల్లోనే వార్షిక మరమ్మతులు పూర్తిచేసి కర్మాగారాన్ని ఉత్పత్తి దశలోకి ప్రవేశపెట్టేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

లక్ష్యానికి చేరువలో..

రామగుండం ఎరువుల కర్మాగారంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలోని మొదటి 6 నెలలు లక్ష్యానికి చేరువలో యూరియా ఉత్పత్తి కొనసాగగా.. సుమారుగా రూ.320 కోట్ల లాభాలను ఆర్జించినట్లుగా భావిస్తున్నారు. రామగుండం వార్షిక ఉత్పత్తి లక్ష్యం 12.7 లక్షల మెట్రిక్ టన్నులు కాగా.. రానున్న ఆరు నెలల్లో ఇంకా 6.35 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి కావాల్సి ఉంది.

6.17 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి

ఈ ఆర్థిక సంవత్సరంలో గడిచిన ఆరు నెలల్లో 6.17 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో ఎరువుల కర్మాగారం లక్ష్యానికి చేరువలో నిలిచింది. మొదటి త్రైమాసికం(ఏప్రిల్, మే, జూన్)లో రూ.168 కోట్ల లాభాలు గడించినట్లుగా అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. రెండో త్రైమాసికం(జులై, ఆగస్టు, సెప్టెంబర్)లో లాభాలను అధికారికంగా ప్రకటించకపోయినా.. సుమారు రూ.150 కోట్ల లాభాలు వచ్చినట్లు భావిస్తున్నారు.

మూడేళ్లు లాభాలు సాధిస్తేనే..

వరుసగా మూడేళ్లు లాభాలను ఆర్జించినట్లయితే సామాజిక బాధ్యతగా ప్రభావిత, పరిసర ప్రాంతాల అభివృద్ధికి ఆర్‌ఎఫ్‌సీఎల్ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. గత రెండేళ్లు లాభాలు ఆర్జించిన ఎరువుల కర్మాగారం ఈ ఆర్థిక సంవత్సరం సైతం లాభాల బాటలో పయనిస్తుండటంతో. . 2025-26 నుంచి సీఎస్సార్ నిధులతో ఈ ప్రాంతాభివృద్ధికి చర్యలు తీసుకోనుంది.

అకాల వర్షంతో తడిసిన ధాన్యం


సుల్తానాబాద్ ఏఎంసీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పల్లోకి చేరిన నీరు

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: సుల్తానాబాద్ ఏఎంసీ కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యం గురువారం అకాల వర్షంతో తడిసింది. వరి కోతలు ప్రారంభమైనందున కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి త్వరితగతిన సేకరించాలని రైతులు కోరుతున్నారు. వర్షాల భయంతో కొందరు రైతులు ధాన్యాన్ని మిల్లులకు తరలించి విక్రయిస్తున్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

ఓదెల, న్యూస్‌టుడే: జీలకుంటలోని ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ ఎంపీటీసీ మాజీ సభ్యుడు రౌతు జలపతి ఆధ్వర్యంలో గురువారం గ్రామస్థులు ఓదెల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ యాకన్నకు వినతిపత్రం అందజేశారు.

చోరీ చేసిన ట్రాక్టరు పట్టివేత

జూలపల్లి: అయిదు నెలల కిందట చోరీకి గురైన ట్రాక్టరును పోలీసులు పట్టుకున్నారు. జూలపల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏసీపీ జి.కృష్ణ కేసు వివరాలు వెల్లడించారు. జూలపల్లి మండలం చీమలపేట గ్రామానికి చెందిన ఏముండ్ల అనిల్‌కు చెందిన ట్రాక్టర్‌ను అయిదు నెలల కిందట బీరన్న ఉత్సవాల సందడిలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ శివారులో నిందితులు ట్రాక్టరును అమ్మడానికి తీసుకెళ్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. నిందితులను చొప్పదండి మండలం చాకుంట గ్రామానికి చెందిన జాతరగొండ అశోక్, శేఖర్‌లుగా గుర్తించారు. వారు చోరీ చేసిన ట్రాక్టరును పొలం వద్ద దాచి అయిదు నెలల తర్వాత విక్రయించడానికి తీసుకెళ్తూ పట్టుబడ్డారు. సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఇన్‌ఛార్జి వేణుగోపాల్, ఏఎస్సైలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: సింగరేణి కార్మిక కుటుంబాలకు తాగునీటిని సక్రమంగా సరఫరా చేయడం లేదని తెబొగకాసం ఏరియా ఉపాధ్యక్షుడు సాంబయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బతుకమ్మ, దసరా పండుగల సమయంలోనూ ఇదే పరిస్థితి నెలకొందన్నారు. సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న సంస్థ పూర్తి స్థాయిలో సమస్యను పరిష్కరించడం లేదన్నారు. తాగునీటి సమస్యపై అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.



గని కార్మికుల 21 వర్ధంతి

యైటింక్లయిన్‌కాలనీ: 2003లో జీడీకే-8ఏ గని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 10 మంది కార్మికులను స్మరిస్తూ.. గురువారం స్మారకస్తూపం వద్ద మృతుల కుటుంబసభ్యులు, పలు సంఘాల నాయకులు 21వ వర్ధంతిని నిర్వహించారు. స్తూపం వద్ద పూలు వేసి ఆనాడు జరిగిన విషాద సంఘటన అధికారుల తప్పిదాన్ని నాయకులు గుర్తు చేశారు.

ఉద్యోగి కుటుంబానికి బీమా పరిహారం



రూ.కోటి చెక్కు అందజేస్తున్న జీఎం సుధాకరరావు, ఎస్‌బీఐ ఆర్ఎం రవీంద్రకుమార్‌సింగ్

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: ఓసీపీ-2గనిలో జరిగిన ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడు ఉప్పు వెంకటేశ్వర్లు కుటుంబానికి ఎస్‌బీఐ నుంచి రూ.కోటి బీమా పరిహారం మంజూరైంది. ఈ మేరకు గురువారం కార్మికుడి భార్య సరోజనకు చెక్కును ఆర్జీ-3 జీఎం సుధాకరరావు, గోదావరిఖని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రవీంద్రకుమార్‌సింగ్ అందజేశారు. జీఎం మాట్లాడుతూ సీఎండీ బలరాం ప్రత్యేక చొరవతో సంస్థ యాజమాన్యం ఎస్‌బీఐతో ఒప్పందం చేసుకుందన్నారు. ఉద్యోగులు ఎస్‌బీఐ ఖాతాను 'కార్పొరేట్ శాలరీ అకౌంట్'గా మార్చుకోవడం ద్వారా రూ.కోటి రూపాయల ఉచిత ప్రమాద బీమా పొందవచ్చన్నారు. ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ రవీంద్ర, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు రామచంద్రారెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, అధికారుల సంఘం కార్యదర్శి శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి అధికారి రాజశేఖర్, పర్సనల్ విభాగాధిపతి సుదర్శనం, డీపీఎం గుర్రం శ్రీహరి పాల్గొన్నారు.

వాల్మీకి జయంతి వేడుకలు

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జీఎం ఎన్.సుధాకరరావు, ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు సంతోశ్, కోట రవీందర్‌రెడ్డి, అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

గనిలో ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్ల పాత్ర కీలకం

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తున్న 15 మంది ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్లకు 12 రోజుల పాటు సెంటినరీకాలనీ ఎంవీటీసీలో నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి హాజరైన జీఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గనిలో ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్ల పాత్ర కీలకమని, బాధ్యతలు తెలుసుకొని విధులు నిర్వహించాలని సూచించారు. శిక్షణ తరగతుల్లో భాగంగా మైన్స్ చట్టాలను అనుసరించి తీసుకోవాల్సిన చర్యలు, గనుల్లో భద్రత పరికరాల వినియోగం, భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎంవీటీసీ మేనేజర్ మల్లన్న, ఎస్ఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రెస్క్యూ విన్యాసాలు


పరేడ్‌లో సభ్యులు

యైటింక్లయిన్‌కాలనీ: 53వ జోనల్‌స్థాయి రెస్క్యూ పోటీల్లో బ్రిగేడియర్ల ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రమాదాలు జరిగినపుడు రెస్క్యూ సభ్యులు ఏ విధంగా కాపాడుతారనే అంశాలను విన్యాసాల రూపంలో ప్రదర్శించారు. అగ్ని ప్రమాదం తదితర అంశాలను 11 ఏరియాల నుంచి వచ్చిన రెస్క్యూ బృందాలు పోటాపోటీగా ప్రదర్శించాయి.

సహపంక్తి భోజనాలు

గోదావరిఖని: సింగరేణి ఉద్యోగుల ఉజ్వల భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో గురువారం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జీఎం లలిత్‌కుమార్ హాజరై భోజనాలు వడ్డించారు. ఇలాంటి సంస్కృతితో ఉద్యోగుల్లో సోదరభావం పెరుగుతుందన్నారు. కార్పొరేటర్ స్వామి, రక్షణ జీఎం గుప్తా, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విజేతగా రామగుండం రీజియన్ జట్టు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2 డివిజన్‌లో జరిగిన 53వ జోనల్‌స్థాయి రెస్క్యూ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా ఆర్జీ-2, 3 ఏపీఏ జట్టు.. ద్వితీయ స్థానం భూపాలపల్లి, తృతీయస్థానంలో బెల్లంపల్లి-మందమర్రి జట్లు నిలిచాయి. డ్రిల్ అండ్ పరేడ్‌లో ఆర్జీ-1, థియరీలో ఆర్జీ-2, 3 ఏఎల్‌పీ, ఉత్తమ రెస్క్యూ రిలేలో ఆర్జీ-1, శ్రీరాంపూర్ డివిజన్, ప్రథమచికిత్సలో మందమర్రి డివిజన్, ఫ్రెష్ ఎయిర్ బేస్‌లో ఇల్లందు, మణుగూరు, కొత్తగూడెం జట్లు ఉన్నాయి. ఉత్తమ రికవరీలో మందమర్రి, బెల్లంపల్లి, ఉత్తమ రెస్క్యూ రికవరీలో ఆర్జీ-2, 3, ఏపీఏ జట్టు, ఉత్తమ కెప్టెన్‌గా అనిల్‌కుమార్, ద్వితీయ స్థానంలో పూర్ణచందర్ విజేతలుగా నిలిచారు. వీరికి భారత బొగ్గు గనుల భద్రత విభాగం ఉన్నతాధికారి ఉమేష్ సావర్కర్, సింగరేణి సంచాలకులు వెంకటేశ్వర్‌రెడ్డిలు జ్ఞాపికలు అందజేశారు.



విజేతగా నిలిచిన జట్టుతో సింగరేణి అధికారులు

పచ్చటి పైరులో వృక్ష రాజసం



రామగిరి మండలం రాజాపూర్‌లోని ఓ రైతు పొలం గట్లపై నాటిన టేకు మొక్కలు ఏపుగా పెరిగాయి. ఇటీవల కొమ్మలు తొలగించగా తిరిగి చిగురించాయి. వరి పైరు మధ్యలో పొడవాటి టేకు చెట్లు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.
-న్యూస్‌టుడే, కమాన్‌పూర్

పొలం బాటలో ముళ్ల పొదలు



రామగిరి మండలం రాజాపూర్ నుంచి పంట పొలాలకు వెళ్లే మార్గంలో చెరువు కట్టపై పెరిగిన తుమ్మ చెట్లతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రింబవళ్లు రాకపోకలు సాగించే ఈ మార్గంలో ముళ్ల పొదలు దారిని కమ్మేశాయి. ఉపాధిహామీ పథకంలో చెట్లను తొలగించాలని రైతులు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, కమాన్‌పూర్

స్వచ్ఛత లక్ష్యం.. నిర్వహణ లోపం

రామగిరి మండలం రాజాపూర్‌లో సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఫలితంగా దుర్గంధం వెదజల్లుతోంది. బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన నిర్మూలనలో భాగంగా స్వచ్ఛభారత్ మిషన్‌లో వీటిని నిర్మించారు. సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో ఇలా మారింది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, కమాన్‌పూర్ (సెంటినరీకాలనీ)



సామాజిక తనిఖీపై సమన్వయ సమావేశం

ధర్మారం, న్యూస్‌టుడే: ఉపాధిహామీ నిధులతో చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సామాజిక తనిఖీ చేపడుతున్నట్లు ఎంపీడీవో ఐ.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం సామాజిక తనిఖీ ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, ఏపీవోలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఉపాధిహామీ ఏపీడీ సత్యనారాయణ, డీవీవో కొమురయ్య, ఎంపీవో రమేష్, ఏఈ రాజశేఖర్, ఏపీవో రవి, సామాజిక తనిఖీ ఎస్సార్పీ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనతో నేరాలకు దూరం

ఎలిగేడు(సుల్తానాబాద్), న్యూస్‌టుడే: ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండి నేరాలకు దూరంగా ఉండాలని సుల్తానాబాద్ మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ పేర్కొన్నారు. ఎలిగేడులో గురువారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు న్యాయ వ్యవస్థ, చట్టాలపై అవగాహన కల్పించేందుకు వీలుగా న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, రమేశ్, ఏజీపీ లక్ష్మీరాజం, న్యాయవాదులు, ఎస్సై వేణుగోపాల్, గ్రామస్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి గణేశ్

జడ్పీటీసీ మాజీ సభ్యుడి కుటుంబానికి పరామర్శ

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: గంగారం గ్రామానికి చెందిన జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొక్కిస రవీందర్ గౌడ్ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పరామర్శించారు. మాజీ ఎంపీపీ నూనేటి సంపత్, నాయకులు నిదానపురం దేవయ్య, జక్కె రవీందర్, కదురు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

మంథని, న్యూస్‌టుడే: బోయినిపేటలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రహదారి పనులకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాదేవి గురువారం భూమిపూజ చేశారు. వైస్ ఛైర్మన్ బానయ్య, కమిషనర్ మనోహర్, కౌన్సిలర్లు సమ్మయ్య, వీకే రవి, లింగయ్య, నాగేంద్ర, పద్మ, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్తు సమస్యలకు తక్షణ పరిష్కారం

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: గ్రామాల్లోని విద్యుత్తు సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ బొంకూరి సుదర్శన్ అన్నారు. గురువారం ఆయన రామగిరి మండలం కల్వచర్లలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎల్‌టీ లైన్ తరచూ తెగిపోతోందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై క్షేత్ర స్థాయిలో పరిశీలించిన ఆయన పాత ఎల్‌టీ లైన్ స్థానంలో కొత్త తీగను వెంటనే ఏర్పాటు చేయించారు. సబ్ ఇంజినీర్ సతీశ్ పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలంటూ గురువారం పెద్దపల్లి బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అల్లెంకి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: బోధన ఉపకార వేతనాల బకాయిలు చెల్లించాలంటూ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యం చేస్తున్న నిరవధిక సమ్మె గురువారం మూడో రోజుకు చేరుకుంది. సుల్తానాబాద్‌లో గురువారం కళాశాల అధ్యాపకులు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. శ్రీవాణి కళాశాల కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక, ప్రధానాచార్యులు కమలాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ధర్మారం: పెండింగ్‌లో ఉన్న బోధనా రుసుములను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ పట్టణ కార్యదర్శి ఆకుల వంశీ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. లేకుంటే పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు.



పెద్దపల్లి అంబేడ్కర్ విగ్రహం ముందు నినాదాలు చేస్తున్న కళాశాలల ప్రతినిధులు

పంటలను పరిశీలించిన కేవీకే శాస్త్రవేత్తలు

ముత్తారం, న్యూస్‌టుడే: మైదంబండ, హరిపురం గ్రామాల్లో పలువురు రైతులు సాగు చేస్తున్న బంతి, పసుపు, ఆయిల్‌పామ్, వరి, పత్తి పంటలను రామగిరి కేవీకే శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. పసుపులో కొమ్ము అభివృద్ధికి రైతులు ఎకరానికి 50 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ పిచికారీ చేయాలన్నారు. మచ్చ తెగులు నివారణకు ప్రోపికొనజల్ మందును మిల్లీలీటర్‌కు లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలన్నారు. అనంతరం ఐఐఎస్ఆర్ టర్మరిక్ స్పెషల్ అనే సూక్ష్మ ధాతు మిశ్రమాన్ని రైతులకు అందజేశారు. శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకన్న, భాస్కరరావు, వినోద్‌కుమార్, పిల్లి కిరణ్, ఏడీఏ అంజనీదేవి, ఏవో హారిక, హరిపురం మాజీ సర్పంచ్ సంపత్‌రావు, రైతులు పాల్గొన్నారు.

సార్వత్రిక డిగ్రీలో ప్రవేశానికి గడువు పెంపు

మంథని, న్యూస్‌టుడే: సార్వత్రిక డిగ్రీలో ప్రవేశానికి అక్టోబరు 30 వరకు గడువు పొడిగించారని మంథని సహాయ కేంద్రం కో ఆర్డినేటర్ కృష్ణ, ప్రిన్సిపల్ జైకిషన్‌ఓజా ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25లో బీఏ, బీకాం, బీఎస్సీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రెండవ సెమిస్టర్ పరీక్ష ఫీజు రూ.1000 అపరాధ రుసుంతో ఈ నెల 20లోగా చెల్లించాలన్నారు.

సదాశయ ఫౌండేషన్ సభ్యులకు అభినందన

ఓదెల, న్యూస్‌టుడే: ఎల్‌వీపీ ఆసుపత్రి ఆధ్వర్యంలో 50 వేల కార్నియాల మార్పిడికి సహకరించిన సందర్భంగా సదాశయ ఫౌండేషన్ సభ్యులను హైదరాబాద్ ఎల్‌వీపీ కంటి ఆసుపత్రి నిర్వాహకులు అభినందించారు. ఎల్‌వీపీ ఆసుపత్రి ఆధ్వర్యంలో 50 వేల కార్నియా మార్పిడి శస్త్రచికిత్సలు చేసి రికార్డు సాధించిన సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆసుపత్రి ఛైర్మన్ గుళ్లపల్లి నాగేశ్వర్‌రావు, ఐబ్యాంక్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సునీత, దాస్ నెట్‌వర్క్ డైరెక్టర్ డాక్టర్ సుజాతలు సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణకుమార్, ప్రధానకార్యదర్శి లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి తదితరులకు అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.



ఫౌండేషన్ సభ్యులకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఆసుపత్రి ప్రతినిధులు

సంక్షిప్తం

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

పాలకుర్తి: మండలంలోని జీడీనగర్ యూనివర్సల్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఇస్మాయిల్ గురువారం తెలిపారు. ఈనెల 18 నుంచి 20 వరకు వరంగల్‌లో జరిగే పోటీలకు పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అఫ్జల్, తల్లిదండ్రులు అభినందించారు.

కోజాగర పౌర్ణమి పూజలు

గోదావరిఖని పట్టణం: కోజాగర పౌర్ణమి సందర్భంగా నగరపాలక ప్రాంతంలోని పలు దేవాలయాలు, కాలనీల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా విశేషంగా ప్రకాశించే చంద్రుని నుంచి అర్ధరాత్రి అమృతధారలు కురుస్తాయనే విశ్వాసంతో.. భక్తులు ప్రత్యేక పూజల అనంతరం పాలల్లో చంద్రుడిని చూసి తరించారు.

న్యాయం జరిగేలా చూడండి

యైటింక్లయిన్‌కాలనీ: ఐని రెండో పట్టణ పోలీసుస్టేషన్‌ను గురువారం ఏసీపీ రమేష్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ.. న్యాయం జరిగేలా చూడాలన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సీఐ ప్రసాదరావు ఉన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు తాడూరి సంపత్‌కుమార్‌ను గురువారం తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. 2018 నుంచి 2021 వరకు రామగిరి మండలం చందనాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసి 35 మంది విద్యార్థులను నూతన ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దారన్నారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మండల విద్యాధికారి కొమురయ్య, ప్రధానోపాధ్యాయురాలు సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

ఉపాధిహామీ గ్రామ సభలు

పాలకుర్తి: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2025-2026 ఆర్థిక సంవత్సరానికిగాను మండలంలోని ఈసాలతక్కళ్లపల్లిలో గురువారం గ్రామసభ గురువారం నిర్వహించారు. ఈనెల 30 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఎంపీడీవో శశికళ, ఏపీవో కొమురయ్య, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి బదిలీ

గోదావరిఖని: నంది మేడారం జూనియర్ సివిల్ జడ్జి వెంకటసచిన్‌రెడ్డి గోదావరిఖనికి బదిలీపై వచ్చారు. ఇక్కడి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మంజుల పెద్దపల్లికి బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు.

పనులు వందశాతం పూర్తి చేయాలి

పాలకుర్తి(అంతర్గాం): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పాలకుర్తి, అంతర్గాం మండలాల పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, వర్మి కంపోస్టు తయారీ తదితర పన్నులు వందశాతం పూర్తి చేయాలన్నారు. డీఎల్‌పీవో వేణుగోపాల్, అంతర్గాం ఎంపీడీవో అలీం, ఎంపీవోలు వేణుమాధవ్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మారంలో దూరవిద్య అధ్యయన కేంద్రం

ధర్మారం: మండలకేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో అధ్యయన కేంద్రం ఏర్పాటు చేసినట్లు సమన్వయకర్త కిరణ్‌కుమార్ తెలిపారు. దూరవిద్య విధానంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి ఈ నెల 31 వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

విద్యుత్తు శాఖ డీఈఈ బాధ్యతల స్వీకరణ

మంథని: ఎన్‌పీడీసీఎల్ మంథని డీఈఈగా ప్రభాకర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పని చేసిన డీఈఈ ఈశ్వర్‌ప్రసాద్ ఉద్యోగ విరమణ పొందడంతో మంచిర్యాల టెక్నికల్ డీఈఈగా పని చేస్తున్న ప్రభాకర్‌కు మంథనిలో పోస్టింగ్ ఇచ్చారు.

రైల్వేపై వంతెన మంజూరు

ఓదెల: కొలనూర్ రైల్వే గేట్ వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ) మంజూరైనట్లు సికింద్రాబాద్ అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ రాజీవ్‌కుమార్ ద్వారా సమాచారం అందిందని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు దండంరాజు రాంచందర్‌రావు తెలిపారు. ఆర్‌వోబీ నిర్మాణం ఆవశ్యకతను ఉన్నతాధికారులకు విన్నవించగా స్పందించిన అధికారులు మంజూరు చేశారన్నారు. ఇటీవలే సర్వే నిర్వహించారని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తనకు లేఖ ద్వారా తెలిపారన్నారు.

సంఘాలు-కార్యవర్గాలు

పెద్దపల్లి కలెక్టరేట్: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రవీందర్, ప్రధానకార్యదర్శిగా శ్రీనివాస్ నియమితులైనట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌నాయక్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మీసాల మలిక్ ఒక ప్రకటనలో తెలిపారు.

రహదారి పనులు ప్రారంభం

కాల్వశ్రీరాంపూర్: వెన్నంపల్లిలో రైతుల పొలాలకు వెళ్లే రహదారి పనులను మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్ గురువారం ప్రారంభించారు. పంట పొలాల వద్దకు వెళ్లడానికి రహదారి లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే విజయరమణారావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

జూలపల్లి: అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం వడ్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మహిళా సాధికారత కేంద్రం జిల్లా చైల్డ్‌లైన్ కేర్ వర్కర్ మమత ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాలల రక్షణ, సంరక్షణ చట్టాలపై వివరించారు. సాధికారత కో ఆర్డినేటర్ దయా అరుణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటుహక్కు నమోదుపై ప్రచారం

సుల్తానాబాద్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదుపై కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్‌సింగ్ గురువారం సుల్తానాబాద్‌లో ప్రచారం చేశారు. పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిసి బరిలో నిలవనున్న తనను ఆశీర్వదించాలని కోరారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: సుల్తానాబాద్‌లో ఎస్జీఎఫ్ అండర్-14, 17 బాలబాలికల వాలీబాల్ పోటీలను మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాజుల లక్ష్మి గురువారం ప్రారంభించారు. జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి సురేశ్, శిక్షకులు శ్రీనివాస్, రవీందర్, రాజమల్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.


క్రీడాకారులతో శిక్షకులు

మద్యానికి బానిసై ఆత్మహత్య

గోదావరిఖని: స్థానిక సప్తగిరికాలనీకి చెందిన సొన్నైల రమేశ్(60) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గోదావరిఖని ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రమేశ్ స్థానిక బస్టాండ్ సమీపంలో సెలూన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో బుధవారం ఇంటినుంచి బయటకు వెళ్లిన రమేశ్ తిరిగి రాలేదు. కాలనీకి సమీపంలోని ఓపెన్‌జిమ్ ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

నేర వార్తలు

కారు ఢీకొని ఒకరు మృతి

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం లాలపల్లికి చెందిన గుర్రం మల్లారెడ్డి(40) వ్యవసాయం చేసుకుంటూనే కరీంనగర్‌లోని ఓ డయాగ్నొస్టిక్ కేంద్రంలో పని చేస్తున్నారు. రోజులాగే ద్విచక్రవాహనంపై కరీంనగర్‌కు వచ్చి విధులు ముగించుకొని స్వగ్రామానికి వెళ్తుండగా మొగ్దుంపూర్ వద్ద కరీంనగర్ నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. మల్లారెడ్డి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందారు. కారును స్థానికులు సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి వద్ద పట్టుకున్నారు. పోలీసులు మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.


మల్లారెడ్డి

దాడి చేసిన యువకుడి అరెస్టు

గోదావరిఖని: స్థానిక జ్యోతినగర్‌కు చెందిన పోశంపై ఇటీవల కత్తితో దాడి చేసిన యువకుడు సాయికుమార్‌ను ఒకటో పట్టణ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఇంట్లో నిద్రపోతున్న పోశంను హత్య చేసేందుకు యత్నించగా.. అరెస్టు చేసినట్లు ఎస్సై భూమేష్ తెలిపారు.

కత్తులు దూస్తున్న బంధుత్వాలు

■ రక్త సంబంధీకుల మధ్య పెరుగుతున్న హత్యలు


■ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విపరీత ధోరణి

న్యూస్‌టుడే- మేడిపల్లి, జగిత్యాల

అమ్మ కడుపులో గోడలు, గొడవలు తెలియకుండా పురుడు పోసుకున్న అన్నదమ్ములు.. పెరిగి పెద్దయిన కొద్దీ బంధాలను మరిచిపోయి కత్తులు దూసుకుంటున్నారు. పురాణాల నుంచీ సంస్కృతీ సంప్రదాయాలకు నెలవుగా ఉన్న సోదర బంధాన్ని హత్యల మాటున దూరం చేసుకుంటున్నారు. కడదాకా తోడుంటామని బాస చేసుకున్న భార్యాభర్తల నడుమ అనుమానం, వివాహేతర సంబంధాలతో గొంతు నులుముకుంటున్నారు. అల్లారుముద్దుగా ఆప్యాయతలు పంచిన తల్లిదండ్రులే తమ రక్త సంబంధాలను చిదిమేస్తున్నారు. తల్లిని కుమారుడు, కుమారుడిని తండ్రి హతమారుస్తున్న సంఘటనలు ప్రతి ఒక్కరినీ కలచి వేస్తున్నాయి.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇటీవల ఛిద్రమైన బంధాల సాక్షిగా పెరుగుతున్న హత్యలపై కథనం...

15 రోజులు.. 7 హత్యలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 15 రోజుల్లో మొత్తం 8 హత్యలు జరిగితే అందులో 7 రక్తసంబంధీకుల మధ్య జరిగినవే కావడం విపరీత ధోరణికి అద్దం పడుతోంది. పెరుగుతున్న ఆస్తుల విలువ, మద్యం, వివాహేతర సంబంధాలు, అసూయ తదితరాలు కుటుంబ బంధాల మధ్య అంతరాలను పెంచుతున్నాయి. సోదరుల మధ్య సంబంధాలు చెడిపోతున్నాయి. భార్యాభర్తలు కొందరిలో చిన్న చిన్న కారణాలే హత్యలకు దారితీస్తున్నాయి. ఇటీవల జరిగిన రక్త సంబంధీకుల హత్యల్లో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో రెండు చొప్పున హత్యలు జరగగా పెద్దపల్లి జిల్లాలో ఒక హత్య కేసు నమోదైంది.



■ హుజూరాబాద్ మండలం రాజపల్లికి చెందిన నోముల అంజి మద్యానికి బానిసయ్యాడు. అప్పులు తీర్చుకునేందుకు తనకు వ్యవసాయ భూమి ఇవ్వాలంటూ అన్న రాజుతో గొడవపడ్డాడు. అన్నను హతమారిస్తే భూమి తనదే అవుతుందనే దుర్బుద్ధితో ఈ నెల 4న రాజును హత్య చేశాడు. బాధాకరమేమిటంటే తల్లిదండ్రులు కూడా తమ పెద్ద కుమారుడి హత్యకు చిన్న కుమారునికి సహకరించారు.

కారణాలు: మద్యం మత్తు, ఆస్తి కాజేయాలనే దురుద్దేశం

■ గోదావరిఖని యైటింక్లైన్ కాలనీలో కాకినాడ అంజలి అనే వివాహిత వినయ్‌కుమార్‌తో వివాహేతర సంబంధం కలిగి ఉండటంతో భర్త శివరామకృష్ణ, అతని సోదరుడు కుమార్ కలిసి వినయ్‌కుమార్‌ను ఈ నెల 10న హతమార్చారు. కుటుంబసభ్యులు, ఇతరుల ఆదరణ కోల్పోయిన అంజలి తన సొంత పట్టణమైన గుంటూరులో ఆత్మహత్య చేసుకుంది. కారణం: వివాహేతర సంబంధం

■ కథలాపూర్ మండలం చింతకుంటకు చెందిన నేతుల మల్లేశంను అతని బావమరిది భూపతి గంగారాం ఈ నెల 1న హత్య చేసి వరదకాలువలో తోశాడు.

కారణాలు: మల్లేశం నేర చరిత్ర, గంగారాం చెల్లెలు లావణ్య, కోడలుకు మల్లేశం నుంచి వేధింపులు

■ రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం జవహర్ నాయక్ తండాలో గుగులోతు సుశీలను భర్త రవి గొంతు నులిమి హత్య చేశాడు. ఈ నెల 12న ఈ ఘటన జరిగింది.

కారణాలు: మద్యం మత్తు, భార్య అనుమానించడం

■ వేములవాడ పట్టణంలోని భగవంతరావునగర్‌కు చెందిన మామిండ్ల మల్లయ్యను సెప్టెంబరు 29న మొదటి భార్య కుమారుడు మామిండ్ల రాజు సహా ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు అల్లుళ్లు కలిసి హత్య చేశారు.

కారణం: ఆస్తి పంపకాలు

■ అక్టోబరు 9న.. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం దుద్దెనపల్లిలో చంద్రయ్య తన సోదరుడు కుమారస్వామితో గొడవకు దిగాడు. మాటామాటా పెరగడంతో కుమారస్వామి దాడి చేయడంతో తమ్ముడు చంద్రయ్య మృతిచెందాడు.

కారణాలు: క్షణికావేశం, మద్యం మత్తు, పాత గొడవలు

■ జగిత్యాల గ్రామీణ మండలం అంతర్గాంకు చెందిన నన్నపనేని విద్యాసాగర్ రాజును అక్టోబరు 1న అతని సోదరుడు విక్రం రాజు హత్య చేశాడు.

కారణం: భూ తగాదాలు

ఆప్యాయతలే బలం.. బలగం

కుటుంబాల మధ్య ఆప్యాయతలు పెరగాలి కానీ అంతరాలు ఎక్కువవుతున్నాయి. గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉన్నప్పుడు ఎవరేం చేసేదీ, మానసిక ప్రవర్తనపై కుటుంబ పెద్దలకు అవగాహన ఉండేది. ఇప్పుడు చరవాణి సహా ఇతర మాధ్యమాల దుష్ప్రభావం బంధాలను చెరిపేస్తున్నాయి. ఆస్తులే ముఖ్యం కాదనే భావన పెరిగినప్పుడు దాడులకు స్థానం ఉండదని మానసిక నిపుణులు చెబుతున్నారు. హత్య లాంటి విపరీత చర్య అనంతరం ప్రాయశ్చిత్త పడటం కంటే అనుబంధాలు, ఆప్యాయతలను వల్లె వేసుకుంటే కుటుంబం ప్రశాంతతకు చిరునామాగా మారుతుంది. ఒకరికొకరు బలం, బలగం అనే భావన ఉంటే రక్తపు మరకలే అంటవు అని నిపుణులు పేర్కొంటున్నారు.

భావోద్వేగాలను నియంత్రించుకోలేకనే..



- డాక్టర్ వీరేందర్, మానసిక నిపుణుడు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ధన ప్రవాహం ఎక్కువగా ఉంటుంది. దుబాయి వెళ్లి కొందరు ఎక్కువ డబ్బులు సంపాదిస్తే ఇంకొందరు వారిపై అసూయ పెంచుకుంటున్న పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో భూ వివాదాలు కూడా ఎక్కువయ్యాయి. డబ్బు కోసం ఏమైనా చేయొచ్చు అనే విపరీత ధోరణి పెరగడం వల్లే హత్యలు జరుగుతున్నాయి. మద్యం ప్రభావం కూడా మనిషి ఏం చేస్తున్నాడో తెలియని స్థితికి తీసుకు వెళ్తుంది. భావోద్వేగాలను నియంత్రించుకోలేక ఏం నిర్ణయం తీసుకుంటున్నారో కూడా తెలియడం లేదు. ఎమోషనల్ కంట్రోల్ తక్కువ.. మనిషిని ఏం చేస్తుందని తెలీదు. బంధాలు కూడా ఈ కారణాల వల్లే దూరమవుతూ హత్యలు పెరుగుతున్నాయి. హత్యలు చేసేవారికి ఐక్యూ లెవల్స్ తక్కువ ఉన్నట్లు మేం భావిస్తాం.

మద్యం, ఆస్తులు కారణమవుతున్నాయి



- రఘుచందర్, డీఎస్పీ జగిత్యాల

మద్యం మత్తులో, వివాహేతర సంబంధాల వల్ల, ఆస్తుల గొడవలతో ఎక్కువగా హత్యలు జరుగుతున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలు చెడిపోవడంతో హత్యలు కూడా పెరుగుతున్నాయి. సాధారణ హత్యల కంటే రక్తసంబంధీకుల మధ్య హత్యలు విపరీత ధోరణులకు అద్దం పడుతున్నాయి. రాణాలకు వివిధ సమస్యలపై వచ్చేవారిని పరిశీలిస్తే... ఆస్తి తగాదాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. కౌన్సెలింగ్ ద్వారా పలు కుటుంబాలు కలిసి మెలిసి ఉంటున్నాయి. ఉమ్మడి కుటుంబ విధానం, విలువలతో కూడిన జీవనం లాంటి వాటిపై అవగాహన కలిగిస్తే రక్త సంబంధీకుల మధ్య గొడవలు, దాడులు, హత్యలు తగ్గించవచ్చు.

ప్రశస్త్‌తో దివ్యాంగ లక్షణాల గుర్తింపు

న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం



ప్రశస్త్ యాప్

పిల్లల్లో దివ్యాంగ లక్షణాలు ఉంటే సరైన సమయంలో గుర్తించి, చికిత్స అందించేందుకు జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి సంకల్పించింది. బాల్యంలోనే దివ్యాంగ లక్షణాలు కనిపించినా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనించక పోవడంతో వయస్సు పెరుగుతున్న కొద్దీ సమస్యలు తీవ్రమవుతాయి. దివ్యాంగ లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి, చికిత్స అందించడం ద్వారా మెరుగైన జీవనం గడపగలరు. చిన్నారుల్లో దివ్యాంగ లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు జాతీయ విద్యా పరిశోధన శిక్షణా మండలి ఆధ్వర్యంలో ప్రశస్త్ ఆన్‌లైన్ యాప్‌ను రూపొందించింది. దేశ వ్యాప్తంగా పాఠశాలల్లో నర్సరీ నుంచి 8వ తరగతి లోపు పిల్లల్లో మూడు దశల్లో దివ్యాంగ లక్షణాల నిర్ధారణ కార్యక్రమాలు చేపట్టనున్నారు.

■ విద్యార్థులు ఇంట్లో కంటే పాఠశాలలోనే అధిక సమయం గడుపుతారు. ఈ క్రమంలో చిన్నారుల నడకలో తేడా, లేదంటే నడవడానికి ఇతరుల సహాయం తీసుకోవడం, శరీరంలోని భాగాల కదలికలో తేడా, మెడ, చేతులు, వేళ్లు, మణికట్టు, కాళ్లు వంటి 21 రకాల దివ్యాంగ లక్షణాలను ఉపాధ్యాయులు గుర్తించే అవకాశం అధికంగా ఉంటుంది. దివ్యాంగ లక్షణాలు గల చిన్నారులను గుర్తించి వారిని ప్రశస్త్ యాప్‌లో పొందుపరుస్తారు. ఇందుకోసం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చరవాణుల్లో మెయిల్ ద్వారా యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.

■ విద్యార్థుల్లో దివ్యాంగ లక్షణాల గుర్తింపు ప్రక్రియ మూడు దశల్లో జరగనుంది. మొదటిదశలో ఉపాధ్యాయుడు రెండు వారాలపాటు గమనించి వివరాలను 26లోగా యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. రెండో దశలో గుర్తించిన విద్యార్థులను శిక్షణ పొందిన నిపుణులు గమనించి మరోమారు యాప్‌లో నమోదు చేస్తారు. చివరి దశలో విద్యార్థి తల్లిదండ్రులకు వివరించి, బాల్యంలోనే మెరుగైన చికిత్స అందించకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని నిపుణులతో కౌన్సెలింగ్ ఇచ్చి వారి అనుమతి మేరకు పరీక్షలకు పంపించనున్నారు.

పాత కక్షలతోనే యువకుడి హత్య

కోరుట్ల, న్యూస్‌టుడే: పాతకక్షలతోనే యువకుడి హత్య జరిగినట్లు డీఎస్పీ ఉమామహేశ్వర రావు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ప్రకాశంరోడ్డుకు చెందిన పంబాల మధు, ఇప్పకాయల నరేశ్‌తో బోయిని సాగర్‌కు ఈనెల 13న రాత్రి గొడవ జరిగింది. గుద్దేటి వెంకటేశ్ వీరి మధ్య రాజీకి యత్నించగా సాగర్ ఒప్పుకోలేదు. సాగర్ తమను ఎప్పటికైనా చంపుతానని బెదిరించాడని మధు, నరేశ్ వెంకటేశ్‌తో చెప్పారు. ఈనెల 14న రాత్రి 10 గంటల ప్రాంతంలో ప్రకాశంరోడ్డులోని పంబాల నాగరాజు ఇంటికి వెళ్లిన సాగర్ అతడితో గొడవపడ్డాడు. విషయం తెలుసుకున్న గుద్దేటి వెంకటేశ్, గుద్దేటి విజయ్, పంబాల రాకేశ్ సంఘటన స్థలానికి వెళ్లి సాగర్‌ను రోడ్డుపై నెట్టివేయడంతో కిందపడ్డాడు. వెంటనే వెంకటేశ్ తన వెంట తెచ్చుకున్న కత్తితో సాగర్ గొంతుకోసి హత్య చేశాడు. అనంతరం నిందితులు ఘటన స్థలం నుంచి పరారయ్యారు. సీఐ సురేశ్‌బాబు ఆధ్వర్యంలో ఎస్సై శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది నిందితుల కోసం గాలింపు చేపట్టారు. గురువారం కోరుట్ల శివారులోని గుద్దేటి వెంకటేశ్‌కు చెందిన నాగులమ్మ బ్రిక్స్ తయారీ ఫ్యాక్టరీ వద్ద నిందితులు అయిదుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద ఒక కత్తి, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు చరవాణులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులలో ఒకరైన పంబాల నాగరాజు పరారీలో ఉన్నాడని, అతడిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపడుతున్నామని, ఇతరుల ప్రమేయం ఉన్నట్లు తేలితే చట్టపరమైనా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెల్లడించారు. సీఐ సురేశ్‌బాబు, ఎస్సై శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువ స్థలాల కబ్జా

విలువైన భూముల్లో అక్రమ కట్టడాలు

న్యూస్‌టుడే, గంగాధర

పట్టా భూములైనా, సర్కారు భూములైనా కబ్జాకు కాదేది అనర్హమంటూ ఆక్రమణదారులు చెలరేగిపోతున్నారు. మారుమూల పల్లెల్లో సైతం గుంట స్థలం రూ.లక్షల్లో ధరలకు రెక్కలు రావడంతో ఇక వాణిజ్య స్థలాలను వదలిపెట్టడంలేదు. ఇందుకు చెరువులు, కుంటల శిఖం భూములతోపాటు సాగునీటి కాలువలను సైతం కబ్జా చేస్తున్నారు. అక్రమ కట్టడాలకు పాల్పడుతుండగా అవి కాస్తా కుచించకపోయి వాటి ఉనికికే ప్రమాదం ఏర్పడింది.

గంగాధర మండలం నారాయణపూర్ జలాశయం పరిధిలో మంగపేట ఎల్లమ్మ చెరువు నుంచి వేములవాడకు కుడి కాలువ 19 కి.మీ ఇప్పటికే పూర్తి చేశారు. కాలువ 60 మీటర్ల వెడల్పుతో నిర్మించగా కుడి వైపు దారికి 4 మీటర్లు, ఎడమ వైపు దారికి 6 మీటర్ల స్థలం వదిలిపెట్టారు. ఇక వాణిజ్య కేంద్రంగా ఉన్న గంగాధర ప్రధాన కూడలిలో మాత్రం 1.6 కి.మీ పొడవునా 45 మీటర్ల వెడల్పుతో ఇరువైపులా దారులకు స్థలం వదిలి కాలువ తవ్వారు. ఈ కాలువ పరిధిలో 12 డిస్ట్రిబ్యూటరీలు, వాటికింద ఉపకాలువల నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టారు. ఇక ర్యాలపల్లి వైపు ఎడమకాలువ 20.5 కి.మీ 40 మీటర్ల వెడల్పుతో పూర్తి చేయగా దానికింద 10 ఉపకాలువలు తవ్వారు. భూసేకరణ జరిపి బాధితులకు అప్పటికే నష్టపరిహారం అందజేశారు.

తేల్చని హద్దులతో ఆక్రమణలు

గ్రామీణ ప్రాంతాల్లో కాలువ పక్కనున్న భూములు పంటలకు అనువుగా ఉండి కొందరు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందిన గంగాధర ప్రధాన కూడలి (మధురానగర్ గ్రామ పంచాయతీ)లో గుంట స్థలం కనీస ధర రూ.15 లక్షలు పలుకుతుండగా కబ్జారాయుళ్ల కన్నుపడింది. గంగాధర ప్రధాన కూడలి నుంచి కురిక్యాల రెవెన్యూ శివారు (పిట్టలపల్లి) వరకు 1.6 కి.మీ వాణిజ్య కేంద్రంగా ఉండి ఇక్కడి భూములకు మార్కెట్‌లో విపరీతమైన డిమాండు ఉంది. కొందరు కాలువ పక్కనున్న దారులను వదిలిపెట్టకుండా ఆక్రమించి కట్టడాలు చేస్తున్నారు. గతంలో కాలువ నిర్మాణం జరుగుతుందని తెలిసి కొందరు అక్రమ కట్టడాలతో నష్టపరిహారం పొందగా, మరికొందరు కాలువ తవ్వకం జరిగి దారులకు వదిలిపెట్టిన స్థలాలు ఆక్రమించి అక్రమ కట్టడాలు చేపట్టారు. ఇంకొందరు ఇదంతా తమదే స్థలమంటూ కాలువ భూములను అమ్ముకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వీటంతటికీ సాగు నీటి శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలున్నాయి. కాలువ నిర్మాణానికి భూసేకరణ జరిపిన అధికారులు అప్పట్లోనే హద్దులు నిర్ణయించి కంచె వేస్తే విలువైన భూములు కబ్జాకు గురయ్యే అవకాశం ఉండదనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇప్పటికే ఎల్లంపల్లి పైపులైన్ల వెంట దారులతోపాటు పైపులైన్ల పైభాగాన్ని ఆక్రమించి పంటలు వేస్తుండగా పైపులైన్లకు ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి కాలువల భూములు కాపాడాల్సిన అవసరముంది.



కాలువ స్థలంలో వెలసిన నిర్మాణాలు

సర్వే చేసి తొలగిస్తాం

నిర్మాణ దశలో ఉన్న కాలువ భూములు ఎవరు ఆక్రమించినా సర్వే చేసి తొలగిస్తాం. కాలువకు కుడి వైపు ఆరు మీటర్లు, ఎడమ వైపు 7 మీటర్ల దూరంలో మురుగుకాలువలు నిర్మించి దారులు వేయాల్సి ఉంది. ఇప్పటికే భూసేకరణ జరిపి నష్టపరిహారం కూడా అందజేశాం. గతంలో నిర్మించిన వాటికి కూడా పరిహారం అందజేశాం. **- వజహత్ అలీ, ఏఈ**

సీసీఐ కొనుగోళ్లకు రంగం సిద్ధం

నోటిఫై జిన్నింగ్ మిల్లుల వద్ద ఏర్పాట్లు

న్యూస్‌టుడే, జమ్మికుంట



గురువారం జమ్మికుంటలోని ఓ జిన్నింగ్ మిల్లులో సీసీఐ కేంద్రం ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన మార్కెటింగ్ శాఖ అధికారులు

కొత్తపత్తి విక్రయాలు పెరుగుతున్న రైతులకు మద్దతు ధర లభించకపోవటంతో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు సిద్ధం అవుతున్నారు. జమ్మికుంట ప్రధాన వ్యవసాయ మార్కెట్‌లో పత్తి విక్రయాలు క్రమేణా ఎక్కువవుతున్నా అధిక తేమశాతంతో మద్దతు ధర రూ.7,521 పలకని పరిస్థితి ఉంది. పత్తికి మద్దతు ధర అందించేందుకు సీసీఐ ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని 18 పత్తి జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేసుకోగా అందులో జమ్మికుంటలోనే ఏడు ఉన్నాయి. నోటిఫై చేసిన జిన్నింగ్ మిల్లుల్లో మార్కెటింగ్ శాఖ అధికారులు గురువారం ఏర్పాట్లు చేపట్టారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసే జిన్నింగ్ మిల్లుల వద్ద సీసీఐ పత్తి కొనుగోళ్లకు సంబంధించిన పత్తి నాణ్యత, తేమ శాతం, మద్దతు ధర వివరాలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. కొనుగోళ్లకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ పనులు మూడు మిల్లుల్లో పూర్తయినట్లు స్థానిక మార్కెట్ కార్యదర్శి ఆర్.మల్లేశం తెలిపారు. నోటిఫై చేసుకున్న జిన్నింగ్ మిల్లుల యజమానులతో సీసీఐ అగ్రిమెంట్ చేసుకోవాల్సి ఉందని ఆయన చెప్పారు.

విక్రయానికి నిబంధనలు : సీసీఐకి పత్తిని విక్రయించేందుకు రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులను తీసుకురావాలి. ■ పత్తి తేమ శాతాన్ని బట్టి మద్దతు ధర రూ.7,521 నుంచి 7,720.16 పైసలు దాకా ఉంది.

సీసీఐ నోటిఫై చేసుకున్న జిన్నింగ్ మిల్లులు (జిల్లాల వారీగా)	
కరీంనగర్	9
పెద్దపల్లి	4
సిరిసిల్ల	5
జగిత్యాల	0

అయ్యప్ప మహా పాదయాత్ర ప్రారంభం

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: కరీంనగర్ నుంచి కేరళలోని అయ్యప్ప క్షేత్రం శబరిమలకు మహాపాదయాత్ర గురువారం ప్రారంభమైంది. లోక కల్యాణ సంకల్పానికి జిల్లా కేంద్రానికి చెందిన గురుస్వామి గడప నాగరాజు ఆధ్వర్యంలో చేపట్టిన 24వ మహాపాదయాత్రను గురుస్వామి కావేటి పరమేశ్వర్ భగత్‌నగర్ అయ్యప్ప దేవాలయం నుంచి ప్రారంభించారు. మొదట ఆలయంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వచ్చిన దీక్షాపరుల ఇరుముడి బంధనం వంటి పూజలు నిర్వహించారు. అనంతరం కోతిరాంపూర్ గిద్దెపెరుమాండ్ల దేవస్థానంలో పాదయాత్ర భక్తులందరికీ పడిశెట్టి భూమయ్య(టేలా) ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. గురుస్వామి నాగరాజు మాట్లాడుతూ.. 60 మందితో మహాపాదయాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు యాగండ్ల అనిల్‌కుమార్, డి.సంపత్, బండారి శ్రావణ్, రుద్రాక్ష కృష్ణ, ప్రశాంత్, శ్రీహరి, కర్ణాల రాము, గంగుల సురేష్, దీక్షాపరులు పాల్గొన్నారు.



శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప దీక్షాపరులు

పిడుగుపాటుకు రైతు మృతి



నర్సింహారెడ్డి

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన కామిడి నర్సింహారెడ్డి (48) అనే రైతు పిడుగుపాటుతో మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలో గురువారం విషాదం నింపింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... నర్సింహారెడ్డి తనకు ఉన్న రెండెకరాలతోపాటు మరో 8 ఎకరాలను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తుండేవాడు. పొలం వద్ద పాడి ఆవులు, గేదెలను పోషిస్తూ ప్రత్యామ్నాయ ఉపాధి పొందేవాడు. ఎప్పటిలాగే పొలం వద్దకు ఉదయం వెళ్లిన నర్సింహారెడ్డి పాలు పితికి, క్యాన్‌ను పక్కన పెట్టాడు. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. కాళ్లు, చేతులు శుభ్రం చేసుకుంటుండగా పిడుగుపడి అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడికి భార్య చంద్రకళ, కుమారుడు అజయ్ ఉన్నారు. పెద్ద దిక్కు అకాల మరణంతో కుటుంబీకులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు మెండె శ్రీనివాస్, బండారి బాల్‌రెడ్డి, గంట బుచ్చాగౌడ్ తదితరులు పరామర్శించారు.


ఎంకాం, ఎంబీఏ, ఎమ్మెస్సీ పరీక్ష ఫలితాల విడుదల

కరీంనగర్ కలెక్టరేట్ : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జులై, ఆగస్టు నెలల్లో జరిగిన ఎంకాం, ఎంబీఏ, ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్) రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్ www.satavahana.ac.in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

యాసంగికి సానుకూలం

న్యూస్‌టుడేతో జగిత్యాల పరిశోధనస్థానం ఏడీఆర్

న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం



ముఖాముఖి

ఉమ్మడి జిల్లాలో అధిక వర్షపాతం కురవటం, భూగర్భ జలమట్టం బాగుండటం, ప్రాజెక్టుల నుంచి ఆయకట్టుకు నీరు రానుండటంతో యాసంగిలో గరిష్ఠ విస్తీర్ణంలో పైర్లు సాగులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో వేయదగిని పంటలు, యాజమాన్యం తదితరాలను జగిత్యాల పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ **గాదె శ్రీనివాస్** 'న్యూస్‌టుడే' ముఖాముఖి ద్వారా వివరించారు. ఆ వివరాలు..

? ప్రశ్న: వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయవచ్చా.

✓ **జవాబు:** నీటి లభ్యతతో వరిని అధికంగా సాగుచేస్తారు. కానీ అనువైనచోట్ల వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల వల్ల రైతులకు మేలు చేకూరుతుంది. వరుసగా ఒకే పంటను సాగుచేస్తే పంట దిగుబడి మందగించడంతోపాటు చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుంది. ఒకే తరహా పంట సేద్యం వల్ల మార్కెట్‌లో వాటి పరిమాణం పెరిగి సరైన గిట్టుబాటు ధర లభించదు. ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా భూసారం పెరగడంతోపాటు రైతులు మద్దతు ధరను పొందుతారు. ఆరుతడి పైర్లతో నీటిని ఆదా చేయవచ్చు.

? యాసంగిలో ఏయే పంటలతో సత్ఫలితాలు సాధించవచ్చు.

✓ రైతులు ప్రధానంగా కోతులు, వన్యప్రాణులు, కూలీల సమస్య, మార్కెటింగ్ తదితరాలను పరిగణనలోకి తీసుకోవాలి. మొక్కజొన్న, జొన్న, సజ్జ, పప్పు దినుసులు, నూనె గింజలు, చెరకు, పొద్దుతిరుగుడు, కుసుమ, చిరుధాన్యాలు, ఆవాలు వంటివి ఈ తరుణంలో సాగు చేయవచ్చు. వీటిని వాణిజ్య పరంగా, ఆహారంగా ఉపయోగించేందుకు వీలుండటం వల్ల మార్కెట్‌లో గిరాకీ ఉంటుంది. డిసెంబరు తరవాత వేరుసెనగ, జనవరిలో నువ్వు పంట వేయడం వల్ల దిగుబడి ఎక్కువగా ఉంటుంది.

? పంటల మార్పిడిపై మీరిచ్చే సలహాలు.

✓ జగిత్యాల, కరీంనగర్, కూనారం పరిశోధనస్థానాలు, ఏరువాక, కృషివిజ్ఞాన కేంద్రాల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు అవగాహన సదుస్సులు నిర్వహిస్తాము. ప్రత్యామ్నాయ పంటల సాగు వల్ల కలిగే ఉపయోగాలను వివరిస్తున్నాం. అధిక దిగుబడినిచ్చే వంగడాలని ఇస్తూ ఉపయోగించమని సిఫార్సు చేస్తున్నాం. క్రిమికీటకాలు, కోతుల నుంచి పంటలను ఏ విధంగా కాపాడుకోవాలో సూచనలు అందిస్తున్నాం. ఏ కాలంలో ఎలాంటి పంటలు వేస్తే అధిక దిగుబడి లభిస్తుందో తెలుపుతున్నాము. నూతన వంగడాలను మినీకిట్లుగా రైతులకు అందిస్తున్నాము.

? నూతన సాంకేతికతను రైతులకు ఎలా చేరవేస్తారు.

✓ ఇంక్యూబేషన్ సెంటర్ ద్వారా రైతులకు ఉప ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇస్తాము. రైతుల క్షేత్రాల నుంచి మట్టి నమూనాలు సేకరించి పరిశీలిస్తాము. ప్రస్తుత పరిస్థితులకు అనుకూలమైన వంగడాల తయారీకి నిరంతరం పరిశోధనలు కొనసాగుతున్నాయి. వాతావరణ మార్పుల వివరాలు ఎప్పటికప్పుడు బులిటెన్‌ల రూపంలో విడుదల చేస్తున్నాం. శాస్త్రవేత్తల బృందాలను రైతుల క్షేత్రాలకు పంపించి పంటల్ని ఆశించే పురుగుల నివారణకు ఎలాంటి మందులను వినియోగించాలి, ఎంత మోతాదులో ఉపయోగించాలో తెలియజేస్తున్నాం.